సీజ్ చేసిన ఇసుక వేలం

బొంరాస్‌పేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్‌చర్లలో శుక్రవారం సీజ్ చేసిన 52ట్రాక్టర్ల ఇసుకకు వేలం నిర్వహించారు. ఆర్ఐ శిరీష ఆధ్వర్యంలో శనివారం వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన మైసని నర్సింహులు రూ.36వేలకు దక్కించుకున్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ పద్మావతి హెచ్చరించారు.

సమాచారం

న్యాయశాస్త్ర ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ ప్రతినిధి, మే 31(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి న్యాయశాస్త్ర శిక్షణకు అర్హులైన బీసీ న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి శనివారం తెలిపారు. దరఖాస్తుదారుల వార్షికాదాయం పట్టణ ప్రాంతం వారికి రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతం వారికి రూ. 1.5లక్షల లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి న్యాయపాలనలో మూడేళ్ల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో నెలకు రూ.వెయ్యి భృతి, అడ్వకేట్ జాబితాలో చేర్చేందుకు రూ.585, బుక్స్ ఫర్నిచర్ కొనగోలుకు రూ.3వేలు ఇస్తారని తెలిపారు. యూజీసీ లా కోర్సు పాసై ఉండాలని, కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలన్నారు. ఈ పథకంలో జిల్లాలో నలుగురికే అవకాశం ఉందని, ఆసక్తి గల వారు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు..

మేడ్చల్ ప్రతినిధి, మే 31(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, నేషనల్ హెల్త్ మిషన్ తెలంగాణ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రోగ్రాం కింద ఔట్‌సోర్సింగ్‌లో డ్రైవర్(1), క్లీనర్(1) పోస్టులు భర్తీ చేస్తామని డీఎంహెచ్‌వో ఉమాగౌరి శనివారం తెలిపారు. దరఖాస్తు ఫారాలను మేడ్చల్-మల్కాజిగిరి.తెలంగాణ.జీవోవీ.ఇన్‌లో ఈ నెల 3 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.


స్కాలర్‌షిప్‌లకు...

మేడ్చల్ ప్రతినిధి, మే 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కాలేజీల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థుల నుంచి 2024-25విద్యా సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరుకు జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి జి.వినోద్‌కుమార్ శనివారం తెలిపారు. కాలేజీల్లో ఈ ఏడాది ప్రవేశం పొందిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు రెన్యూవల్‌ను ఈపాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రైవేట్ దోపిడీ!

తోక పేర్లతో విద్యా సంస్థల ప్రచార హోరు!

- విద్యార్థులను చేర్పించాలని ఇంటింటి క్యాంపెయిన్
- టెన్త్ ర్యాంకులపై తప్పుడు పబ్లిసిటీ
- మోసపోతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- సంపాదనే ధ్యేయంగా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



మరి కొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. విద్యార్థులను చేర్చుకునేందుకు ఇంటింటికి తిరుగుతూ తమ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలోని చాలా విద్యా సంస్థలు నిబంధనలు పాటించడం లేదు. అడ్మిషన్, ట్యూషన్, డొనేషన్ అని భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. డిజిటల్, టెక్నో, గ్లోబల్, ఇంటర్‌నేషనల్ తదితర తోక పేర్లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తద్వారా తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజు గుంజుతున్నాయి.

పరిగి, మే 31(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లోనే ప్రైవేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల కోసం ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. విద్యాహక్కు చట్టానికి లోబడి ప్రైవేట్ పాఠశాలలు, ప్లే, టెక్నో, ఈ-టెక్నో, కరిక్యులమ్, ఎక్సలెన్స్, గ్లోబల్, టాలెంట్ తదితర పేర్లతో ప్రచారం నిర్వహించడం నిషిద్ధం. ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లోనే అడ్మిషన్లు తీసుకోవాలి. అయితే పట్టణాల్లో ఎప్పటి నుంచో ఈ విద్యా సంస్థలు పబ్లిసిటీ చేస్తూ పరిగి లాంటి చిన్న పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లోనూ అడ్మిషన్ల ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు, టీచర్ల ప్రచారం


మిగతా 8వ పేజీలో...

ప్రైవేట్ విద్యా సంస్థలపై అధికారులు నిఘా పెట్టాలి



జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలు దోపిడీ చేస్తున్నాయి. ఫీజులు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. ఫీజులకు సంబంధించి వివరాలను పాఠశాలల్లో బోర్డుపై డిస్‌ప్లే చేయాలి. ఆ ప్రకారమే ఫీజు తీసుకోవాలి. అయితే ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. వారిపై జిల్లా విద్యాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. స్కూల్ యాజమాన్యాలు ఇచ్చే అమ్యామ్యాలకు లొంగి పట్టించుకోవడం లేదు.

– ఎం.నాగేశ్వర్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు



చెదిరిన రంగుల కళ

- కంప్యూటర్, టెక్నాలజీ రాకతోనే దెబ్బ
- జీవనోపాధి కోల్పోతున్న ఆర్టిస్టులు
- కుటుంబ పోషణకు ప్రత్యామ్నాయం వైపు

Sunday Special

కుంచె చేతబట్టి రంగు రంగుల బొమ్మలు, బోర్డులు, కాన్వాసులు వేసే ఆర్టిస్టుల జీవనం దుర్భరంగా మారింది. డిజిటల్ టెక్నాలజీ రాకతో ప్రజలు హ్యాండ్ ఆర్ట్స్ కన్నా సాంకేతిక టెక్నాలజీతో వేసిన బొమ్మలు, బోర్డులకే మొగ్గు చూపుతున్నారు. దీంతో దశాబ్దాలపాటు కళను నమ్ముకున్న ఆర్టిస్టులకు ఉపాధి కరువై కుటుంబ పోషణ భారంగా మారింది. - పరిగి, మే 31(ఆంధ్రజ్యోతి)

అక్షరాలను అందంగా మలచి ఆకట్టుకునే పెయింట్లు, బొమ్మలు, బోర్డులుగా తీర్చిదిద్దే ఆర్టిస్టుల జీవితాలు ఈ డిజిటల్ యుగంలో దర్భరంగా మారాయి. ఆదరణ లేక వారు కొట్టుమిట్టాడుతున్నారు. ఆర్టిస్టులు నేర్చుకున్న కళకు ఆదరణ తగ్గి వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ఐదారేళ్ల క్రితం వరకు సైన్ బోర్డులు, బ్యానర్లు కన్పించేవి. సైన్ బోర్డు ఆర్టిస్టులే కాదు.. రంగుల్ని, అక్షరాలను నమ్ముకున్న

మిగతా 7వ పేజీలో...

వ్యవసాయం చేసుకుంటున్న



మాది పరిగి పట్టణ పరిధి ఎర్రగడ్డపల్లి. ఆర్టిస్ట్‌గా 18ఏళ్లు పని చేశా. పరిగి, హైదరాబాద్‌లలో సినిమా రంగంలోనూ ఆర్టిస్ట్‌గా పని చేశాను. అప్పట్లో నెలకు రూ.50వేల నుంచి 70వేల వరకు సంపాదించేవాణ్ణి. ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీ రాకతో ఉపాధి కరువైంది. దీంతో నాకున్న రెండెకరాల్లో పంటలు పండించుకుంటున్నా. ఎవరైనా ఆర్డరిస్తే వెళ్తా. అది కూడా నెలలో ఒకటి అరా వస్తాయి.

– షర్ఫొద్దీన్, ఆర్టిస్ట్, పరిగి

అనంతగిరిలో 9వ శతాబ్దపు జైన గుహలు



జైన గుహలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి, ఆయన బృందం

- జైన మతానికి చెందినవిగా గుర్తింపు
- పరిరక్షించాలని ప్రభుత్వానికి శివనాగిరెడ్డి విజ్ఞప్తి

వికారాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలోని అనంతగిరిలో క్రీస్తు శకం 9వ శతాబ్దపు జైన గుహలు వెలుగులోకొచ్చాయి. ఈ గుహలు జైన మతానికి చెందినవిగా పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. జైన సన్యాసులు వర్షాకాలంలో గడపడానికి, సల్లేఖన వ్రతం (ఆహార, పానీయాలుమానేసి మరణాన్ని ఆహ్వానించడం) ఆచరించేందుకు వీటిని ఉపయోగించి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అనంత పద్మనాభస్వామి ఆలయ పరిసరాల్లోని 15 గుహలను బృందంతో కలిసి శనివారం సందర్శించారు. చతురస్రం, దీర్ఘచతురస్రాకారంలో ఉన్న ఈ గుహలు దాదాపు 6మీటర్ల పొడవు, 3మీటర్ల వెడల్పు, 2.5మీటర్ల ఎత్తు కలిగి తూర్పు ముఖంగా తెరిచి ఉన్నట్లు వారు గుర్తించారు. పద్మాసనంలో ఉన్న జైన తీర్థంకరుని విగ్రహం ఆధారంగా ఈ గుహలు క్రీ.శ.9వ శతాబ్దం కాలానికి చెందినవిగా స్పష్టమవుతోందని ఆయన అన్నారు. పురాతన వారసత్వ సంపదైన జైన గుహలను సంరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వానికి శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

కళావిహీనంగా గొల్లచెరువు



తాండూరు మున్సిపాలిటీలో ప్రధానమైన నీటి వనరుగా ఉన్న గొల్లచెరువు గుర్రపు డెక్కతో కళా విహీనంగా మారింది. సుందరీకరణకు ఎంపికైనఈ చెరువులో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఇరిగేషన్ అధికారులు ఈ గుర్రపు డెక్కను తొలగించకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటి ప్రవాహం నిలిచిపోయి దుర్వాసన వస్తోందని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. దాదాపు ఐదెకరాలకుపైగా చెరువులో గుర్రపు డెక్క విస్తరించిందని, దానిని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- తాండూరు, మే 31(ఆంధ్రజ్యోతి)

3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ 3 నుంచి 13 వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ పరీక్షలకు మొత్తం 5,203 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణకు 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్ష సెంటర్లో ఒక ఏఎన్ఎంను నియమించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం

నిల్వలతో ఇబ్బందులు

- మూడు నెలల కోటా పంపిణీ ఎలా?
- అయోమయంలో డీలర్లు



ఓ రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

మేడ్చల్ ప్రతినిధి/కులకచర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలతో డీలర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. తమ వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం తీసుకెళ్లాలని రేషన్ డీలర్లు ఉన్నతాధికారులను కోరుతున్నారు. రెండు నెలలుగా సన్న బియ్యం పంపిణీ జరుగుతుండగా దొడ్డు బియ్యం ముక్కిపోయే అవకాశం ఉందని డీలర్లు అంటున్నారు. చిన్నచిన్న గదుల్లో నిర్వహిస్తున్న రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ప్రస్తుతం మూడు నెలలకు సరిపడా సన్న బియ్యం పంపిణీ జరుగుతుండటంతో వచ్చే బియ్యాన్ని నిల్వ చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం దొడ్డు బియ్యం బస్తాలను వెనక్కు తీసుకోకుండా రేషన్ డీలర్ల దుకాణంలోనే నిల్వ ఉంచడంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ నెల ఉగాది నుంచి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ సమయంలో అప్పటికే రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని అధికారులు స్టాక్ రిజిష్టర్‌లో ఎంట్రీ చేసి అక్కడే ఉంచారు. అప్పటి నుంచి సన్న బియ్యాన్ని డీలర్లు పంపిణీ చేస్తున్నారు. ఇరుకైన రేషన్ దుకాణాల్లో డీలర్లు ఓ పక్క దొడ్డు బియ్యం సంచుల నిల్వ మరో పక్క సన్న బియ్యం సంచులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పుడే మూడు నెలలకోటా ఒకేసారి పంపిణీకి సిద్ధమవుతోంది. రేషన్ దుకాణాల్లో బియ్యం సంచుల నిల్వకు చోటులేక సన్న, దొడ్డు బియ్యం సంచులు కలిసిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.బియ్యం బస్తాల నిల్వకు డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డు బియ్యం బస్తాలు రెండు నెలలకుపైగా అక్కడే ఉంచారు. ఎలుకలు, పురుగులు తినేస్తున్నాయి. నిల్వల్లో తేడావస్తే కేసులు నమోదవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల్లో మూడు నెలల కోటా కూడా దుకాణాలకు రానుంది. ఈ క్రమంలో సన్న బియ్యం సంచులను ఎక్కడ నిల్వ చేయాలో అర్థంకాక డీలర్లు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే దొడ్డు బియ్యం బస్తాలను వెనక్కు తీసుకోవాలని కోరుతున్నారు. కులకచర్ల మండలంలో 30 రేషన్ దుకాణాల్లో 200కు పైగా క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



శామీర్‌పేట, మే 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ నార్త్ వెంచర్‌లోని 30ఫీట్ల రోడ్డు, 2,200గజాల పార్క్ స్థలాన్ని కొందరు కబ్జా చేసి, ఇల్లు, ప్రహరీ కట్టారు. దీంతో నార్త్ ఎవెన్యూ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన హైడ్రా శనివారం అక్రమ నిర్మాణాలను కూల్చింది. కార్యక్రమంలో హైడ్రా అధికారులు ఇన్‌స్పెక్టర్ నరేష్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

వికారాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగికి సహజమని, మనం చేసిన పనితోనే గుర్తింపు వస్తుందని డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం అనంతగిరిలోని హరిత రిసార్ట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) సంగప్ప ఉద్యోగ విమరణ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో వికారాబాద్, ధారూరు, పరిగి, కొడంగల్ అటవీ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనాలని రైతుల ఆందోళన

7

- మైల్వార్ కొనుగోలు కేంద్రం వద్ద నిరసన
- ఇప్పటికే కేంద్రంలో 6వేల బస్తాల వడ్లు నిల్వ ఉంచారన్న అన్నదాతలు

మూడు నెలల రేషన్ ఒకేసారి

7

- వికారాబాద్ జిల్లాలో పది మంది తహసీల్దార్ల బదిలీలు, కొత్త పోస్టింగులు
- కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్లడి

నూతన విధానాలతో ముందుకు సాగాలి

వార్షిక ప్రణాళిక వర్క్‌షాప్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్



కలెక్టరేట్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులు

వికారాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు నూతన విధానాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ రెండు రోజుల పాటు సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్, విద్యాశాఖ సంయుక్తంగా ఎంఈవో, సీహెచ్ఎం, డీఆర్పీ, సెక్టోరల్ అధికారులకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎఫ్ఎల్ఎన్ కోసం జిల్లా వార్షిక ప్రణాళిక వర్క్ షాపనకు కలెక్టర్ విచ్చేసి ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలోనే పాఠశాలల్లో చిన్నారులు అక్షరాలు, సంఖ్యలు సులభతరంగా గుర్తించేలా విద్యాబోధన ఉండాలన్నారు. ఉపాధ్యాయ, కాంప్లెక్స్ సమావేశాల్లో సులభతరంగా, అర్థమయ్యేలా బోధన జరిగే విధంగా తర్ఫీదునివ్వాలని తెలిపారు. ఆట పాటలతో ఉపాధ్యాయులను అనుకరించే విధంగా బోధించాలని ఆయన తెలిపారు. వర్క్‌షాప్‌లో డీఈవో రేణుకాదేవి, సీఎస్ఎఫ్ ప్రాజెక్ట్ లీడ్ జెప్తా, మేనేజర్ ఆయుషి, సీఎస్ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.






మొదళ్లగూడలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పారదర్శకంగా కాంగ్రెస్ ప్రజాపాలన

నందిగామ, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారదర్శకంగా ప్రజాపాలన కొనసాగుతుందని, అర్హులందరికీ సొంతింటి కల నెరవేరుస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం నందిగామ మండలం మోత్కుళ్లగూడ, ఈదులపల్లి, శ్రీనివాసులగూడ, మజీద్‌మామిడిపల్లి, మంచన్‌పహాడ్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. మొదటివిడతలో నందిగామ మండలానికి 402ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్వాకంతో అదుపు తప్పిన ఆర్థిక వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి చక్కదిద్దుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాడన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ వద్ద తట్టెడు మట్టికూడా వేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జంగ నర్సింలు, శివశంకర్‌గౌడ్, దేపల్లి కుమార్‌గౌడ్, నవీన్‌గౌడ్, సతీష్ ముదిరాజ్, చీకుర్తి దర్శన్, పసుల బుచ్చయ్య, కావలి క్రిష్ణ, శేఖర్‌రెడ్డి, జంగయ్య, రాజలింగం, గోపాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పనారి స్వామి, వేణు, మధుగౌడ్, బిక్షపతి, రాజు, మల్లేష్ అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు

కడ్తాల్, మే 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోర్షకొండ తండాలో శనివారం బొడ్రాయి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బొడ్రాయి వేడుకల నేపథ్యంలో తండాలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాలలో ఉన్న గిరిజనులు తండాకు తరలి వచ్చారు. బొడ్రాయి వద్ద తండా గిరిజనులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనం కుండలతో బొడ్రాయి వద్దకు వచ్చి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు వెంకటయ్య, లాయక్‌అలీ, జంగయ్య, రాజునాయక్, మహేశ్ యాదవ్, రాజు, శ్రీను, చందర్, దేవ్, గోపాల్, దేవేందర్, సంతోష్, దేవుజా, పాండురెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, మహేందర్, పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకలకు విరాళం

కడ్తాల్ మండలం కోర్షకొండ తండాలో శనివారం బొడ్రాయి వేడుకలకు బీఆర్ఎస్ నాయకులు రూ.45వేలు విరాళాలు అందజేశారు. జర్పుల రాదాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ ఛైర్మన్, లంబాడహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్ రూ.25వేలు, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్‌రూ.10వేలు, మైసిగండి మాజీ సర్పంచ్ తుల సీరామ్ నాయక్ రూ.5వేలు, మాజీ ఉపసర్పంచ్ పాండు రూ.5వేలు అందజేశారు.వేడుకలకు విరాళాలు అందజేసిన నాయకులకు నిర్వాహకులు సత్కరించారు.


యాచారం : పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కందుకూరు: మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఆలయాన్ని గ్రామానికి చెందిన కుర్దమోని సుమలతా జయేందర్‌ముదిరాజ్ సహకారంతో నిర్మించారు. ఈనెల 30 నుంచి జూన్ ఒకటి వరకు వేద పండితులు రేవెళ్ల రాజుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠతో పాటుసింహవాహనం, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగనున్నాయి. శనివారం ఉదయం చండీహోమం, విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, బోనాల ఊరేగింపు ఉంటుందని ఆలయ నిర్మాణ దాత కుర్దమోని సుమలతా జయేందర్ ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ గ్రీన్‌ఫార్మా పోలీస్ స్టేషన్ సీఐ లిక్కి కృష్ణంరాజు, పాల్గొన్నారు.


విగ్రహాలను శుద్ధి చేస్తున్న మహిళా భక్తులు


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న గిరిజనులు


బోనాలతో వెళుతున్న మహిళలు

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు

వికారాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరికి ఉద్యోగ విరమణ తప్పదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవాన్ని శనివారం పట్టణంలోని తేజ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ తరపున జీవరాజును ఘనంగా సన్మాంచారు. పదేళ్లుగా జిల్లాలో సమర్థవంతమైన అధికారిగా పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీఎంహెచ్‌వో తుకారం, నాంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాయిబాబా, డాక్టర్ రవీంద్రనాయక్, డాక్టర్ రతన్‌లాల్, రిటైర్డ్ డీఎంహెచ్‌వో షిండే, డాక్టర్ పవిత్ర, డాక్టర్ బీబీ జానీ, డాక్టర్ నిరోషా, డాక్టర్ ప్రవీన్ కుమార్, టీజీవో ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.


జీవరాజును సన్మానిస్తున్న అధికారులు


















దేకుల్‌కోడ్ శివారులో పొలంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

అన్నదాతలు బిజీబిజీ

కొడంగల్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురిసిన వర్షాలతో అన్నదాతలు సంతోషంలో ఉన్నారు. మే చివరి వారంలోనే తొలకరి పలకరించడంతో రైతన్నల్లో ఆశలు చిగురించాయి. కొడంగల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు రెండు రోజులుగా పొలాల్లో అరకలు దున్ని విత్తనాలు వేసే పనుల్లో బిజీ అయ్యారు

ధాన్యం కొనాలని ఆందోళన



కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

బషీరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): వడ్లకొనుగోలు చేయడంలేదని మైల్వార్ కేంద్రంవద్ద రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ధాన్యం తెచ్చి రోజులు గడుస్తున్నా తూకాలు వేయడంలేదని నిర్వాహకుడితో గొడవ పెట్టుకున్నారు. ఓ పక్క వర్షాలతో అవస్థలు పడుతున్నామని, నిత్యం ఎండబోసి కప్పి ఉంచడమే కానీ కొనుగోలు చేయడంలేదని రైతులు వాపోయారు. తూకాలు వేసి రైసుమిల్లుకు పంపిస్తే ధాన్యం బాగలేదని, లారీలను వెనక్కి పంపుతున్నారని రైతులు వాపోయారు. ఈ విషయమై స్థానిక నాయకులు కె.నరేందర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫోన్‌లో వివరించగా..రైతులు ఆందోళన చెందొద్దని, అధికారులను పంపి కొనుగోలు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు నిర్వాహకులతో గొడవకు దిగారు. 800బస్తాల ధాన్యాన్ని మిల్లుకు పంపితే బస్తాకు 7కిలోల చొప్పున కట్ చేశారని రైతులకు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేషన్‌కార్డుదారులకు ఒకేసారి మూడునెలల బియ్యం పంపిణీ

● వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మే31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈసారి రాష్ట్రంలో అత్యధిక వర్షాలు కురియనున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డుదారులకు మూడు నెలలకు సంబంధించిన సన్నబియ్యం ఒకేసారి పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. జిల్లాలో 588 రేషన్ దుకాణాల ద్వారా 2,51,097 కార్డుదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఒకేసారి 16,518 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.ఈసారి జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించాలనే లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటి వరకు రైతుల నుంచి 67,250 మెట్రిక్ టన్నులు సేకరించామని, ఈధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.104 కోట్లు జమచేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ఇంకా 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని భావిస్తున్నామని, గత సీజన్‌తో పోలిస్తే ఇప్పటికే రెండింతల ధాన్యం జిల్లాలో కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం సేకరించేందుకు ఇప్పటి వరకు 24.70 లక్షల గోనె సంచులు సరఫరా చేశారన్నారు. ధాన్యం సేకరణ సజావుగా కొనసాగేలా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

తహసీల్దార్లకు పోస్టింగులు...

వికారాబాద్ జిల్లాలో పది మంది తహసీల్దార్లకు బదిలీలు, కొత్త పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఐదుగురు తహసీల్దార్లు గత ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లి ఇటీవల తిరిగి వచ్చిన వారున్నారు. జె.బుచ్చయ్యకు నవాబ్‌పేట తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇవ్వగా, షాహేదాబేగంను బషీరాబాద్ తహసీల్దార్‌గా, వహీదా ఖాటూన్‌ను చౌడాపూర్, ఎస్.రవీందర్‌ను మోమిన్‌పేట్, ఎస్.వెంకటస్వామిని యాలాల్ తహసీల్దార్లుగా నియమించారు. ఇదిలాఉంటే, దోమ తహసీల్దార్ పురుషోత్తంను మర్పల్లికి బదిలీ చేయగా, మోమిన్‌పేట్ తహసీల్దార్ మనోహర్ చక్రవర్తిని కులకచర్ల, వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం డీఏవో గోవిందమ్మను దోమ తహసీల్దార్లుగా బదిలీ చేశారు. మర్పల్లి తహసీల్దార్ మునీరుద్దీన్‌ను కలెక్టరేట్ ఈ-సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేయగా, సెలవులో ఉన్న కులకచర్ల తహసీల్దార్ మురళీధర్‌ను తాండూరు సబ్ కలెక్టరేట్ డీఈవోగా నియమించారు.

సదస్సులకు సరిపడా సిబ్బందిని కేటాయించాలి

మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, 31(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డీఆర్‌వో హరిప్రియాతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాల్లో ముందు రోజు చాటింపు ద్వారా ప్రజలకు తెలపాలన్నారు. వారి అర్జీలతో పాటు సంబంధిత డాక్యుమెంటు కాపీలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కేటగిరీల వారీగా అంశాలను పరిశీలించి అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులకు సరిపోను సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాష్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

● ఎమ్మెల్యే మల్లారెడ్డి



అన్నోజిగూడలోని శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు

ఘట్‌కేసర్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని శ్రీకంఠ మహేశ్వర స్వామిని ప్రార్థించినట్లు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆయన శనివారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో జరిగిన శ్రీకంఠ మహేశ్వర స్వామి ఆలయ 3వ వార్షికోత్సవ పూజల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకుడు ఏర్పాటుచేసిన రియల్ఎస్టేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి కంఠమహేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, రెడ్డియా, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, శేఖర్, మహేష్, చిన్న నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకున్న వజ్రేష్ యాదవ్ తదితరులు

చెదిరిన రంగుల కళ

● కంప్యూటర్, టెక్నాలజీ రాకతోనే దెబ్బ

● జీవనోపాధి కోల్పోతున్న ఆర్టిస్టులు

● కుటుంబ పోషణకు ప్రత్యామ్నాయం వైపు

(ఐదో పేజీ తరువాయి..)

కమర్షియల్ ఆర్టిస్టులు, ఫొటో స్టూడియో బ్యాక్‌గ్రౌండ్ ఆర్టిస్టులు, అద్దాల పెయిటింగ్ కళాకారులు నేటి టెక్నాలజీ తాకిడికి తట్టుకోలేకపోతున్నారు. నేర్చుకున్న కళతో ఉపాధి దొరక్క వేదన పడుతున్నారు. చిత్రపటాలు, సైన్‌బోర్డులు, క్లాత్ బ్యానర్ల స్థానంలో ఫ్లెక్సీ ప్రింట్‌లు, డిజిటల్ బోర్డులొచ్చాయి. కళాకారుల కుంచెలు మూలనపడ్డాయి. సినిమా రిలీజ్ సమయాల్లో హీరోల కటౌట్ పెయింటింగ్స్ కనిపించేవి. ప్రస్తుతం వాటి స్థానంలో ఫ్లెక్సీలు వస్తున్నాయి. గోడలపై ప్రభుత్వ అడ్వర్టైజ్‌లు వేస్తున్నా వాటిని కాంట్రాక్టర్లే సొంతం చేసుకుంటున్నారు. ఏళ్లుగా కళను నమ్ముకున్న వారికి ఉపాధి కరువై జీవనం దినదిన గండంగా మారింది.



పెయింట్ వేస్తున్న షర్ఫొద్దీన్

ఓ ఆర్టిస్ట్ ప్రస్థానం

ఫూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్‌కు చెందిన బ్రహ్మాంచారి 1987లో మూడో తరగతి చదువుతున్న నాటి నుంచే బొమ్మలు గీయడం ప్రారంభించాడు. ఆరో క్లాసు నుంచి చదువు, ఆర్టిస్టు జీవితాన్ని ప్రారంభించాడు. 35ఏళ్లుగా బొమ్మలు గీయడమే కాకుండా జనరల్ ఆర్టిస్ట్‌గానూ అనుభవం ఉన్నా నేటి పరిస్థితుల్లో జీవనానికి సరిపోను ఆదాయం రాక ఇబ్బంది పడుతున్నాడు. అప్పట్లో ఇతనే ఇద్దరికి ఉపాధి కల్పించాడు. డిజిటల్‌బ్యానర్ల రాకతో బతుకులు దుర్భరం అయ్యాయని వాపోయాడు. నెలకు 50వేల వరకు సంపాదించే వాడినని, ఇప్పుడు పనిదొరకడం లేదన్నాడు.

ఆర్టిస్టు పనులకు రేట్లు ఇలా

గ్రాఫ్స్, బోర్డులకు వేసే రంగుల ఖర్చు, వినియోగదారులిచ్చే రేటుకు గిట్టుబాటు కావడం లేదు. అదే కంప్యూటర్ ఫ్లెక్సీలు సగం రేట్లకే వస్తుండడంతో వినియోగదారులు ఆరిస్టుల వద్దకు రావడం లేదు. 8/12ఫీట్ల బొమ్మలు, ఇతర పెయింట్లకు ఎనామిల్ పెయింట్‌కు రూ.3వేలు, కాన్వాస్ పెయింట్ అయితే రూ.6వేల ఖర్చు అవుతుంది. 4/6ఫీట్ల బొమ్మలు, పెయింట్ బోర్డు తయారీకి పెయింట్‌తో వెయ్యి రూపాయల ఖర్చు, రెండు రోజుల సమయం పడుతుంది. కాన్వాస్ పెయింట్ అయితే రూ.3వేలు, నాలుగురోజుల సమయం పడుతుంది. 2/2ఫీట్ల ఎనామిల్ పెయింట్‌కు వెయ్యి, ఒకరోజు సమయం, కాన్వాస్ పెయింట్ అయితే రూ.2వేల ఖర్చు, ఒక రోజు సమయం పడుతుందని ఆర్టిస్టులు చెబుతున్నారు. కార్టూన్లు అయితే 12/6 ఇంచుల కార్టున్‌కు రూ.300, 6/6 ఇంచ్‌ల బొమ్మకు రూ.300 తీసుకుంటారు. బోర్డు పెయింట్లకయితే ప్రతీ స్క్వేర్ ఫీటుకు రూ.40 చొప్పున తీసుకుంటారు. ఉన్నత పాఠశాల బోర్డు, చిత్రాలు, క్లాస్ రూం పెయింట్లకు రూ.20వేలకుపైగా ఖర్చువుతుంది. వీటిలో మెమొరీ డ్రాయింగ్, స్టీల్ లైఫ్, నేచర్, లెటర్ రైటింగ్, ఫ్రీ అండ్ డ్రాయింగ్, జామెటికల్, మోడల్ డ్రాయింగ్, ప్యాట్రన్ డైజైన్‌లు ఉంటాయి. పాఠశాల పనులకు పది రోజుల సమయం పడుతుంది. రంగులకు పది వేల వరకు ఖర్చువుతుంది.

డిజిటల్ దెబ్బ..!

చేతి ఆర్టిస్టుల ధరలతో పోలిస్తే సగానికే డిజిటల్ బ్యానర్లు, బోర్డులు లభ్యం కావడంతో వ్యాపారస్తులు, ఇతర వినియోగదారులు డిజిటల్‌కు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆర్టిస్టులు ఉపాధి కోల్పోతున్నారు. రెండున్నర మీటర్ల పొడవు క్లాత్ బ్యానర్ కావాలిస్తే ఆర్టిస్టుల వద్ద 400 ఖర్చువుతుంది. అదే డిజిటల్ బ్యానర్ అయితే రూ.200 అవుతుంది. డిజిటల్ రాకతో తమ కళకు గుర్తింపు లేక గిరాకీ బాగాపడిపోయిందని కళాకారులు వాపోతున్నారు.

కాంట్రాక్ట్ టీచర్‌గా పని చేస్తున్నా



ఆర్టిస్ట్ రంగంలో ఉపాధి దొరక్క కొన్ని రోజులు వ్యవసాయం చేశా. ఇప్పుడు సోమన్‌గుర్తి ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్నా. జీతం కూడా సకాలంలో ఇవ్వడం లేదు. ఆర్టిస్టులను అడిగేవారు, పట్టించుకునేవారే లేరు. వందలాది మంది ఆర్టిస్టులు రోడ్డునపడుతున్నారు. ప్రభుత్వం మాకు ఉపాధి కల్పించాలి.

- బ్రహ్మంచారి ఆర్టిస్ట్, పరిగి



నూతన కార్యవర్గంతో సైదులు

సమస్యల పరిష్కారానికి కృషి

● టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు

కడ్తాల్, మే 31(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. శనివారం కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో ఆమనగల్లు బ్లాక్ స్థాయి జర్నలిస్టుల నూతన కార్యవర్గాన్ని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నర్సింహ, అధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, ఉపాధ్యక్షులుగా శేఖర్, హఫీజ్, లక్ష్మణ్, కోశాధికారిగా యాదగిరి, సంయుక్త కార్యదర్శులుగా తిరుపతయ్య, తిరుపతయ్య గౌడ్, ప్రచార కార్యదర్శులుగా రవి, గణేశ్, సహాయ కార్యదర్శిగా శేఖర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, అజీమ్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఆనంద్, జిల్లా కమిటీ సభ్యులుగా యూనుస్, చంద్రశేఖర్, వెంకటేశ్‌లను ప్రతిపాదిస్తున్నట్లు తీర్మానం చేశారు. జర్నలిస్టుల సమస్యలు హక్కులు, సంక్షేమం, కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి నరేశ్‌లు పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జాతీయ కమిటీ సభ్యుడు దేవేందర్, జిల్లా నాయకులు సురేశ్, శ్రీనివాసాచారి, గణేశ్, చంద్రశేఖర్, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు సముదాయంలో సౌకర్యాలు కల్పించాలి

షాద్‌నగర్ అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు సముదాయానికి సౌకర్యాలను పెంచాలని బార్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. కోర్టు ఆవరణలో బీటీ వేయాలని, భవనంపై రెండోఫ్లోర్ నిర్మించాలని కోరినట్లు తెలిపారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో కృతజ్ఞతలు తెలిపినట్లు వేణుగోపాల్‌రావు చెప్పారు. ఆయనతో బార్ అసోసియేషన్ నాయకులు గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, అంతారం నర్సింహులు, బొమ్మగళ్ళ రమేష్, పబ్బె శ్రీశైలం, రేవల్లి విజయ్‌కుమార్, పాత్లావత్ రూప్‌సింగ్‌లు ఉన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న వేణుగోపాల్‌రావు

మాజీ సర్పంచ్‌లకు ప్రశంసలు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న లక్ష్మీనర్సింహారెడ్డి, శంకర్

కడ్తాల్, మే 31(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జన్‌మన్ యోజన) పథకం ద్వారా అందించిన సేవలకు కడ్తాల మండల పరిధి కడ్తాల, అన్మాస్‌పల్లి, ఎక్వాయిపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లకు ప్రశంసలు లభించాయి. 2019-2024లో విద్యుత్, సురక్షిత తాగు నీరు, విద్య, జీవనోపాధి పథకాలు ఆదివాసీలకు చేరువయ్యేలా కృషి చేసినందుకు కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, ఎక్వాయిపల్లి మాజీ సర్పంచ్ సుగుణసాయిలుకు విద్యుత్ శాఖ రాజేంద్రనగర్ ఎస్‌ఈ శ్రీరాంమోహన్ కడ్తాల విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద శనివారం ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రజల సహకారంతోనే పథకాల లక్ష్యాలను పూర్తిచేసుకున్నట్లు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లను ఎస్‌ఈ శ్రీరాంమోహన్ అభినందించారు. కార్యక్రమంలో ఏడీఈలు బాలకృష్ణ, శంకర్, ఏఈ నరేందర్, నాయకులు రాంచంద్రయ్య, అశోక్,కృష్ణయ్య, యాదయ్యగౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

● సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

వికారాబాద్, మే 31: పొగతాగడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని, ధూమపానం మానేస్తేనే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా న్యాయసంస్థ(డీఎల్ఎస్ఏ) సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని మెడికల్ కాలేజీ కన్‌స్ట్రక్షన్ సైట్‌లో శనివారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పించారు. పట్టణంలోని అనంతగిరిపల్లి పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కార్మికులతో కలిసి పొగతాగడం మానేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ, అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్లు వెంకటేశ్, రాములు, అడ్వకేట్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరు



మంచాల : అమ్మవార్ల పూజలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రతీ ఒక్కరు దైవభక్తి అలవర్చుకోవాలి

యాచారం, మే 31(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి నెలకొనాలంటే ప్రతీ ఒక్కరు దైవభక్తి అలవర్చుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మంచాల మండల కేంద్రంలో గంగమ్మ, పెద్దమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ దైవభక్తితో పాటు ప్రతీ ఒక్కరు యోగా, ధ్యానం చేయడం అలవర్చుకోవాలన్నారు. సమాజంలో నేడు అశాంతి నెలకొనడానికి దైవచింతన లేకపోవడమే కారణమని అన్నారు. మండల ప్రగతి కోసం తన వంతు సహకారమందించనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు నిర్వాహకులు ఎంపీని ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు జయమ్మ, నాయకులు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లకు కనీస వేతనం అందించాలి

సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్

కందుకూరు, మే 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నారుల ఆలనాపాలన చూస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. కందుకూరు సెక్టార్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.26వేల కనీస వేతనం అందించాలని, వారితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 26 సంవత్సరాలుగా పాలకులు వారి సమస్యల పట్ల చిన్న చూపు చూస్తున్నారని అన్నారు. జూన్ 9న దేశ వ్యాప్తంగా 39 జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలి

● ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 31(ఆంధ్రజ్యోతి): జూన్ 3 నుంచి 23 వరకు గ్రామాలవారీగా జరుగనున్న రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ హాల్‌లో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సదస్సులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, వీలైనంతమేర చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేట్లు చూడాలని ఆదేశించారు. నూతన ఆర్వోఆర్, భూభారతి చట్టం వచ్చిన తర్వాత అనేక మార్పులు తీసుకవచ్చారని.. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి దగ్గరికే వెళ్లి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల వారీగా అన్ని రికార్డులను వెంట తీసుకెళ్లి సమస్య ఏదైనా కూలంకషంగా తహసీల్దార్ల పరిధిలో పరిష్కారమయ్యేవి అక్కడే పరిష్కరించాలని సూచించారు. కోర్టు కేసులను మినహాయించి, సమస్యలు పరిస్కారం వాటిపై దరఖాస్తులు తీసుకొని ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుందన్నారు. రోజువారీగా వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన వివరాలను అదేరోజు సాయంత్రం పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మాడ్గుల తహసీల్దార్లు సునీతారెడ్డి, ప్రసాద్‌రావు, అయ్యప్ప, సుదర్శన్‌రెడ్డి, జానకి, వినయ్‌సాగర్‌లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

మద్యం మత్తులో.. రోడ్డుపై కునుకు



మద్యం మత్తులో రోడ్డుపై నిద్రిస్తున్న వ్యక్తి

ధారూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొందరు విచక్షణ కోల్పోయి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తుంటారు. మోతాదుకు మించి మద్యం తాగి ప్రమాదకర చేష్టలతో ప్రజలను ఇబ్బందులు పెడుతుంటారు. కిక్కులో ఏం చేస్తున్నారో కూడా వారికి తెలియదు. అలాంటి ఘటన ధారూరులో చోటు చేసుకుంది. ధారూరు-తాండూరు ప్రధానరోడ్డుపై శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఫుల్లుగా మద్యం తాగి ఏకంగా వైన్స్ దుకాణం ముందున్న రోడ్డుపై నిద్రించాడు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనాదారులు అతడి పక్కన నుంచి మెల్లిగా వెళ్లారు. సుమారు 2గంటల పాటు ఆ వ్యక్తి రోడ్డుపై అలాగే పడుకోవడాన్ని గమనించిన కొంతమంది అతడిని అక్కడి నుంచి లేపి రోడ్డు పక్కకు పడుకోబెట్టడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

మోమిన్‌పేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచన మేరకు ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని ఎన్కెపల్లికి చెందిన మంగలి పవన్‌కు రూ.2లక్షల 50వేలు, టేకులపల్లికి చెందిన జాకారం ఇబ్రహింకు రూ.90వేలు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, నాయకులు సురేందర్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ధారూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మోమిన్‌కలాన్, నాగారం, తరిగోపుల, గురుదోట్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సందర్శించారు. అనంతరం వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రాములు, దేవేందర్, హఫీజ్, భీంసేన్, జైపాల్‌రెడ్డి, బాల్‌రాజ్‌నాయక్, శశాంక్, రవి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలి



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి

తాండూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్ అన్నారు. తాండూరు మండల వ్యవసాయాధికారి కొమరయ్య ఆధ్వర్యంలో శనివారం పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ఉదయ్ భాస్కర్‌లతో కలిసి రైతులకు ఆగ్రోస్ వద్ద జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కొమరయ్య, ఏఎంసీ మాజీచైర్మన్ డీసీఎంఎస్ మేనేజర్ సలీం, ఆగ్రోస్ యజమాని శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి ప్రమాదకరం

పరిగి, మే 31 (ఆంధ్రజ్యోతి): ధూమపానం ఆరోగ్యానికి ప్రమాదకరమని పరిగి మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప అన్నారు. అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పరిగిలో ఇండస్‌వ్యాలీ సుదీక్ష స్కూల్ ఆవరణలో అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాశ్, పాఠశాల ప్రిన్సిపాల్ సునిల్‌కుమార్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గౌస్‌పాష, న్యాయవాదులు పాల్గొన్నారు.

కులకచర్ల: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించారు. వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి పొగాకుతో కలిగే నష్టాలను అవగాహన కల్పించారు. వైద్యాధికారి కిరణ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పొగాకు తీసుకోవడంతో కలిగే అనర్థాలు, వచ్చే వ్యాధుల గురించి వివరించారు.

రేపటి నుంచి మెరిట్ స్కాలర్‌షిప్ కౌన్సెలింగ్

ఘట్‌కేసర్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): అనురాగ్ యూనివర్సిటీలో రేపటి నుంచి ఇఏపీ సెట్ (ఇంజనీరింగ్ అగ్రికల్చరల్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గరిష్ఠంగా విద్యార్థులు వందశాతం వరకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందవచ్చాన్నారు. బీటెక్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్ జూన్ 2 నుంచి 6 వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఇఏపీ సెట్‌లో మొదటి ర్యాంక్ నుంచి 25వేల ర్యాంక్ ఆధారంగా ట్యూషన్ ఫీజులో భారీ వినాహాయింపు ఉంటుందన్నారు. ఇతర సమాచారానికి తల్లిదండ్రులు 8181057057 నంబరును సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన స్థానికులు

శామీర్‌పేట, మే 31 (ఆంధ్రజ్యోతి): అలియాబాద్ మున్సిపాలిటీకి నూతనంగా నియామకమైన మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌ను శనివారం పలువురు స్థానికులు కలిసారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మాజీ సర్పంచు గురుకు కుమార్ యాదవ్, మాజీ ఉపసర్పంచు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

శామీర్‌పేట, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎంపికైన లబ్ధిదారులు మనుకా మహేశ్వరి, మర్యాల లలిత, బత్తిని రమేష్‌ల ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.కృష్ణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని నర్సింగ్‌రావుగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వీరన్నగారి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌లో ధాన్యం, మొక్కజొన్న, పసుపు బీట్లు

ధారూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం ధాన్యం, మొక్కజొన్న, పసుపు బీట్లు నిర్వహించారు. బీట్లలో ధాన్యం 1010రకం క్వింటాలుకు రూ. 1,750 నుంచి రూ.1, 970ల వరకు, సోనా రకం క్వింటాలుకు రూ.2,150ల నుంచి 2,230 వరకు, మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,000ల నుంచి రూ.2,250ల వరకు పసుపు క్వింటాలుకు రూ.10వేల నుంచి 10,200ల వరకు ధరలు పలికాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు. ధాన్యం 886.8 క్వింటాళ్లు, మొక్కజొన్న 1164 క్వింటాళ్లు, పసుపు 10.2 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని ఆమె చెప్పారు.

మైదానంలో వాటర్‌ట్యాంకు వద్దు

- పాఠశాల ఆవరణలో నిర్మాణానికి అధికార యంత్రాంగం నిర్ణయం
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థులు, స్థానికులు



మేడ్చల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాల

మేడ్చల్ టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గల మైదానంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి ప్రభుత్వం చేసిన ప్రతిపాదన పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 10 ఎకరాల విశాలమైన మైదానంలో 1956లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పాఠశాలలో వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగారు. ఒక్క ప్రైవేటు పాఠశాల లేని రోజుల్లో ప్రతీ ఒక్కరికి విద్యను ప్రసాదించిన పాఠశాలగా పేరొందింది. అలాంటి పాఠశాల ఆవరణలో తాగునీటి వాటర్ ట్యాంకు నిర్మించాలని జిల్లా ఉన్నత అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికులు, పూర్వ విద్యార్థులు జిల్లా అధికారుల తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే కొందరు పూర్వ విద్యార్థులు జిల్లా అధికారులకు వినతులు సమర్పించారు. పాఠశాలలో చదివే విద్యార్థులు చదువులతో పాటు ఆటలు ఆడుకోవాలన్న ఉద్దేశ్యంతో పాఠశాల ఆవరణలో పూర్వీకులు ఈ విశాలమైన మైదానాన్ని ఏర్పాటు చేశారని స్థానికులు అంటున్నారు. తరుచూ పాఠశాలలో నిర్వహించే ఆటల పోటీలతో పాటు జిల్లా, మండల స్థాయి ఆటల పోటీలు పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ మైదానంలో ప్రభుత్వం వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టడం స్థానికులకు నిరాశకు గురిచేసింది. 1956లో నిర్మించిన పాఠశాల భవనం పురాతనమైనది కావటంతో మరో కొత్త భవనం నిర్మించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు ఆడుకోవటానికి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ లాంటి క్రీడలకు మైదానం అనువుగా ఉంటుంది. అయితే ఇతర నిర్మాణాలు చేపడితే ఇబ్బందులు ఎదురవుతాయని పూర్వ విద్యార్థులు, స్థానికులు భావిస్తున్నారు.

వాటర్ ట్యాంకు నిర్మించొద్దు



పాఠశాల స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. 69 సంవత్సరాలుగా అందరికి విద్యను ప్రసాదించిన పాఠశాల ఆవరణలో ఇతర నిర్మాణాలు చేపట్టొద్దు. విద్యార్థులు ఆడుకోవడానికి పాఠశాల ఆవరణను విశాలంగా తీర్చిదిద్దాలి.

- అమరం హేమంత్‌రెడ్డి (పూర్వ విద్యార్థి)

పాఠశాల ఉనికికే ప్రమాదం



పాఠశాల ఆవరణలో ఇతర నిర్మాణాలు చేపడితే పాఠశాల ఉనికి దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రశాంత మైన వాతావరణంలో విద్యార్థుల చదువులు కొనసాగాలంటే పాఠశాల ఆవరణలో ఇతర నిర్మాణాలు చేపట్టొద్దు. వేల మందికి విద్యను ప్రసాదించిన విద్యాలయం పరిసరాలను విద్యార్థులు ఆడుకునే విధంగా తీర్చిదిద్దారు.

- ప్రదీప్ వర్మ(పూర్వ విద్యార్థి)

నూతన తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



చౌడాపూర్: వహీదాఖాతూన్‌ను సన్మానిస్తున్న నాయకులు



మోమిన్‌పేట్: తహసీల్దార్ రవీందర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చౌడాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా వహీదాఖాతూన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ పార్టీ నాయకులతో కలిసి ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సలీమ్, వెంకటయ్యగౌడ్, రాము, చెన్నయ్య, గోపాల్‌నాయక్, యాదయ్య, యాదయ్య, చిన్నయ్య, మన్యం పాల్గొన్నారు.

కులకచర్ల: మండల పూర్తిస్థాయి తహసీల్దార్‌గా మనోహరచక్రవర్తిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మనోహర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ ఇన్‌చార్జి వ్యవహరించారు. మోమిన్‌పేట్ నుంచి బదిలీపై మనోహరచక్రవర్తి కులకచర్లకు వచ్చారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహరచక్రవర్తి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శనివారం నూతన తహసీల్దార్‌గా రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. మనోహరచక్రవర్తి కులకచర్ల మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది బదిలీపై వెళ్లిన మనోహరచక్రవర్తి, నూతన తహసీల్దార్ రవీందర్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐలు గోవర్ధన్, సరిత, జూనియర్ అసిస్టెంట్లు అలవేలు, హరిత, రాజు, ధరణి పాల్గొన్నారు.

మర్పల్లి: భూ సంబంధిత సమస్యలపై దళారులను ఆశ్రయించకుండా రైతులు నేరుగా సమస్యలను పరిష్కరించుకోవాలని మర్పల్లి తహసీల్దార్ పురుషోత్తం



మోమిన్‌పేట్: మనోహరచక్రవర్తిని సన్మానిస్తున్న సిబ్బంది

తెలిపారు. మర్పల్లి తహసీల్దార్ మునిరోద్దీన్ బదిలీపై వికారాబాద్‌కు వెళ్లగా ఆయన స్థానంలో దోమ మండలంలో పని చేసిన పురుషోత్తం మర్పల్లి తహసీల్దార్‌గా శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

బషీరాబాద్: మండల తహసీల్దార్‌గా షాహిదాబేగం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడా పని చేసిన తహసీల్దార్ వై.వెంకటేష్ సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జోగులంబ గద్వాల్ జిల్లా నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు.

దోమ: మండల నూతన తహసీల్దార్‌గా గోవిందమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పురుషోత్తం మర్పల్లి మండలానికి బదిలీ అయ్యారు.

నవాబుపేట: మండల నూతన తహసీల్దార్‌గా తహసీల్దార్ బుచ్చయ్య ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జయరాం సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బుచ్చయ్య బాధ్యతలు స్వీకరించారు. భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకులు పోతురాజు, సుధీర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ బుచ్చయ్యను సన్మానించారు. కార్యక్రమంలో రాంచందర్, హనుమంతు పాల్గొన్నారు.

ప్రైవేట్ దోపిడీ!

(ఐదో పేజీ తరువాయి)

జోరందుకుంది. టెక్నో స్కూళ్లు, ఇంటర్‌నేషనల్ స్కూల్స్, పబ్లిక్ స్కూల్స్ తదితర ఆకట్టుకునే పేర్లతో ప్రచారం చేసుకుంటున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. హైస్కూళ్లకు, కిడ్స్ స్కూళ్లకు తోకపేర్లను జోడించి ప్రచారం చేసుకోవడం ప్రైవేట్ పాఠశాలలకు ఆనవాయితీగా మారింది. స్కూళ్లకు తోకపేర్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాటి గుర్తింపు రద్దు చేయాలని ప్రభుత్వం అధికారులను దేశించింది. దీనిపై దీంతో అధికారులు నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకున్నారు. మరికొన్ని స్కూళ్లు చిన్న తరగతులకు అనుమతి తీసుకొని అంతకంటే ఉన్నత తరగతులు నడిపించినట్లు తేలింది. అలాంటి పాఠశాలలపైనా చర్యలు తీసుకోలేదు. జిల్లాలో 120కిపైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కులకచర్ల, మోమిన్‌పేట్, మర్పల్లి తదితర ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. అవి రకరకాల పేర్లతో ప్రచారం చేస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం వెలువడిన టెన్త్ ఫలితాలపై పరిగిలోని కొన్ని పాఠశాలల తప్పుడు ప్రచారం చేసుకుంటున్నాయనే విమర్శలొస్తున్నాయి. తమ స్కూల్‌లో కొందరు విద్యార్థులకు వందకు వంద శాతం మార్కులు(గ్రేడ్లు) వచ్చాయని తప్పుడుప్రచారం చేసుకుంటున్నాయి. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

నిబంధనలకు విరుద్ధం.. తప్పుడుప్రచారాలు

ఏ ఒక్క పాఠశాల కూడా నిబంధనలు పాటించడం లేదు. ప్రైవేట్ స్కూళ్లు అర్హులైన ఉపాధ్యాయులు, వసతి సౌకర్యం, పరికరాలు, ఫర్నిచర్, ఆటస్థలం,గ్రంథాలయం, ప్రయోగశాల, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటివి కలిగి ఉండాలి. అలాగే స్కూల్ బిల్డింగ్‌కు పోలీస్, ఫైర్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల ఎన్‌వోసీ తీసుకోవాలి. అయితే ఏ ఒక్క పాఠశాలకూ పూర్తి అర్హతలు లేకున్నా ప్రభుత్వ గుర్తింపు మాత్రం లభిస్తోంది. అధికారులను మేనేజ్ చేసుకుంటూ చాలా ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలను స్కూళ్లను నడుపుతున్నాయి. ఒక్కో గదిలో రెండు, మూడు తరగతులు నిర్వహిస్తున్న అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గ్రంథాలయాలు లేకున్నా వందల పుస్తకాలు లైబ్రరీలో ఉన్నట్లు రికార్డులు చూపుతున్నారు. ఉదాహరణకు పరిగిలోనే దాదాపుగా 20కిపైగా ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వాటిల్లో కొన్నింటికి ప్రభుత్వ గుర్తింపే లేదు. ప్రభుత్వ రికగ్నిషన్ ఉందని అడ్మిషన్ తీసుకొంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసగిస్తున్నారు. ఇలాంటి పాఠశాలలపై అధికారులు చర్యలేవీ తీసుకోవడం లేదు. నాన్ రికగ్నైజ్డ్ స్కూళ్లలో చదివితే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. గుర్తింపు లేని విద్యా సంస్థలో చదువుతో విద్యార్థి నాన్ రెగ్యులర్ ఎడ్యుకేషన్ కిందికి వెళ్లి ఉద్యోగాలు, ఇతర అంశాల్లో రెగ్యులర్ విద్యార్థులతో పోటీ పడలేకపోతారు.

కళాశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు



కళాశాల ఆవరణలో మద్యం సీసాలు

బొంరాస్‌పేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అసాంఘిక కార్యకలపాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సీసాలు, సిగరెట్ ప్యాకెట్లు, ఇతర చెత్త వేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటివి పాల్పడుతున్న వారిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కోరారు.

నేడు పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

వికారాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ శ్రీవీరశైవ సమాజం, యువదళ్ ఆధ్వర్యంలో 2025లో పదోతరగతి పరీక్షాఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వీరశైవజంగమ, లింగాయత్ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు, సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటలకు ఎన్నేపల్లిలోని శ్రీజగజ్యోతి బసవేశ్వర విద్యాసంస్థ ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమానికి విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

మూడుచింతలపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కులపై ప్రతీఒక్కరికి అవగాహన అవసరమని మూడుచింతలపల్లి తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాగిశెట్టిపల్లిలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, డీటీ అనూష, మాజీ సర్పంచ్ కృపాకర్‌రెడ్డి , రవికుమార్ పాల్గొన్నారు.

ఎంసీపల్లి కమిషనర్‌ను కలిసిన నేతలు

మూడుచింతలపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన పవన్‌కుమార్‌ను శనివారం వివిధ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గన్నాథం, రవీందర్‌రెడ్డి, సర్వన్, గోపాల్, మాజీ వార్డు సభ్యులు నవీన్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం



వికారాబాద్: కృష్ణారావును సన్మానిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వికారాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ ప్రతీ ఉద్యోగికి సహజమని వికారాబాద్, యాదాద్రి జిల్లా వ్యవసాయాధికారులు మోహన్‌రెడ్డి, గోపాల్ అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ సమయంలో అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్వరూప, వెంకట్ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

బషీరాబాద్: బషీరాబాద్ ఎంపీడీవోగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన శెట్టి రవికుమార్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే సోదరుడు, ఆర్బీఎల్ ఇండస్ట్రీ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. తాండూరులోని ఓ ఫంక్షన్‌హాలులో శనివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శెట్టి రవికుమార్, భాగ్యశ్రీ దంపతులను పలువురు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాండూరు, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, నవాంగ్జీ, యాలాల సొసైటీ చైర్మన్లు ఎ.వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.



శెట్టి రవికుమార్ దంపతులను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సంక్షిప్తంగా..

ఆలయ అభివృద్ధికి విరాళం

కీసర: నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి దాయరలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి శనివారం కీసర దాయరకు చెందిన మణికంఠ రియల్ ఎస్టేట్ యజమాని చింతల సతీష్ రూ.26వేల విరాళాన్ని అందజేశారు.

కుట్టు మిషన్ అందజేత

కీసర: కీసరకు చెందిన సునీత నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆమె కుటుంబానికి వీయూ చారిటీ సంస్థ చైర్మన్ బండారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం కుట్టు మిషన్‌ను అందజేశారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

బొంరాస్‌పేట్: మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈవో హరిలాల్ పాఠ్యపుస్తకాలను అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

వికారాబాద్: వికారాబాద్ పట్టణంతో పాటు గిరిగేట్‌పల్లి, మదన్‌పల్లి, సిద్దులూరు విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా ఆదివారం(నేడు) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సన్మానం

కులకచర్ల: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఐసీడీఎస్ పరిగి సీడీపీవో మెహెరున్నీసా బేగం అన్నారు. మండలంలో ఉద్యోగ విరమణ పొందిన నర్సమ్మ, వీరమణి, అంబాబాయి, లలితబాయితో పాటు ఆరుగురు ఆయాలకు స్థానికంగా అంగన్‌వాడీ టీచర్లు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

క్రైం కార్నర్

రైతు మృతికి కారణమైన డ్రైవర్ రిమాండ్

నవాబుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిమీనపల్లి శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతికి కారణమైన డ్రైవర్ హత్కర్ సందీప్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. వట్టిమీనపల్లి గ్రామానికి చెందిన గొల్ల కృష్ణయ్య పొలం దగ్గర పనులు ముగించుకొని రోడ్డు పక్కన నిలబడగా శంకర్‌పల్లి నుంచి అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా శనివారం డీసీఎం డ్రైవర్ హత్కర్ సందీప్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'కక్షగట్టి అట్రాసిటీ కేసు పెట్టించారు'

ఘట్‌కేసర్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): కావాలనే కొందరు తనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారని రియల్‌వ్యాపారి చెరుకు శివారెడ్డి తెలిపాడు. కొర్రెముల ఏకశిలనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏకశిలనగర్ వెంచర్ బాధితుల కోసం పోరాటం చేస్తున్నందునే కొందరు తనపై కక్షగట్టి మొగులయ్యతో కేసు పెట్టించారని ఆరోపించాడు. గతంలో మొగులయ్యపై మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో తానే ఫిర్యాదు చేశానన్నాడు. కేసు కొనసాగుతుండగా అతడిని ఎలా తిడతానని ప్రశ్నించాడు. ఏకశిలనగర్‌లో మొగులయ్య ప్లాట్ కొంటున్న సమయంలో అతడి వెంటే ఉన్నానని శివారెడ్డి తెలిపాడు. తనపై పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసు వీగిపోతుందని ధీమా వ్యక్తం చేశాడు. తనను ఇబ్బంది పెట్టడానికే కేసుపెట్టారని తెలిపాడు.

డబ్బుల విషయంలో గొడవ

- తొమ్మిది మంది బైండోవర్

తాండూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నాపరాతి గని కార్మికుడు అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బులు తిరిగి యజమానికి ఇచ్చే విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్కాపూర్ నాపరాతి గనిలో పనిచేస్తున్న ఓ కార్మికుడు యజమాని వద్ద అడ్వాన్స్ డబ్బులు తీసుకున్నాడు. శుక్రవారం రాత్రి అట్టి డబ్బులు తిరిగి ఇచ్చే విషయంలో కార్మికుడు, యజమాని మధ్య మాటామాట పెరిగింది. ఈ వివాదం కాస్తపెద్దదై ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకునే వరకు వెళ్లింది. విషయం తెలుసుకున్న కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి సిబ్బందితో రాగా, రూరల్ సీఐ నగేష్, తాండూరు పోలీసులు కూడా మల్కాపూర్ చేరుకున్నారు. ఇరువర్గాలకు నచ్చజెప్పినా వినకుడా మద్యంమత్తులో గొడవపడ్డారు. దీంతో పోలీసులు శనివారం తొమ్మిది మందిని తాండూరు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మరో ఇద్దరిని బైండోవర్ చేయాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. మళ్లీ ఎవరైనా గొడవకు దిగితే ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున జరిమానా విధిస్తామని ఎస్ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. గ్రామంలో అంతా కలిసిమెలిసి ఉండాలని ఎస్ఐ సూచించారు.

ఆధునిక పద్ధతిలో సాగు చేయాలి



బషీరాబాద్‌లోని రైతు వేదికలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

బషీరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతిలో సాగు చేయాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. బషీరాబాద్‌లోని రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమానికి ముఖ్యతిథిగా తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు సుధారాణి, డాక్టర్ పరిమళ, డాక్టర్. కె.శేఖర్ పాల్గొని మట్లాడారు. వ్యవసాయంలో రైతులు పాటించాల్సిన పలు అంశాలపై వివరించారు. ముఖ్యంగా రసాయన ఎరువులు వాడరాదన్నారు. అనంతరం రైతులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏవో అనిత, ఏఈవోలు పలువురు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి) : ఈనెల 3 నుంచి 13 వరకు అయా గ్రామాల్లో జరుగనున్న రెవెన్యూ సదస్సులను భూబాధితులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డీఎస్ రజిని తెలిపారు. ఆమె తన కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 3న ఘట్‌కేసర్, ఎదులాబాద్, 4న కొర్రెముల, కొండాపూర్, 5న ప్రతాప్‌సింగారం, పడమటిసాయిగూడెం, 6న అవుశాపూర్, కాచవానిసింగారం, 9న అంకుశాపూర్, ముత్వెల్లిగూడ, 10న మాదారం, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, 11న మర్రిపల్లిగూడ, అన్నోజిగూడ 12న యంనంపేట్‌లలో సదస్సులు ఉంటాయన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బొంరాస్‌పేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ హెచ్చరించారు. మండలంలోని బురాన్‌పూర్ గ్రామ వైజంక్షన్ దగ్గర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు.తనిఖీల్లో 21 నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నియమాలు మార్చాలి

యాలాల, మే 31 (ఆంధ్రజ్యోతి): అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు నియమాలు సవరించాలని పీఆర్టీయూటీఎస్ యాలాల మండల అధ్యక్షుడు సి.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సీహెచ్. రాములు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. 2015 నాటి అసంబద్ధమైన రేషనలైజేషన్ నిబంధనలు ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే దిశగా అనాలోచితంగా జారీ చేస్తున్న సర్దుబాటు ఉత్తర్వులు సరైనవి కావన్నారు. 60మంది పిల్లల వరకు కేవలం ఇద్దరు టీచర్లు మాత్రమే అనడం సమంజసం కాదన్నారు. 30 మంది దాటితే ఐదుగురు ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలో ఉండాలన్నారు.

మోమిన్‌పేట్ వాసికి పీహెచ్‌డీ పట్టా

మోమిన్‌పేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మన్సబ్‌దారి కుటుంబానికి చెందిన మొహ్మద్ ఆరీఫ్ కుమారుడు డాక్టర్ మొహ్మద్ అఫ్రోజ్‌కు గీతం యూనివర్సిటీ హైదరాబాద్ వారు పీహెచ్‌డీ పట్టా అందించారు. ఫార్మా సూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన అఫ్రోజ్‌కు పీహెచ్‌డీ అవార్డు వరించింది. నూతన ఎటిరో సైక్లిక్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, వర్గీకరణ, జీవ మూల్యాంకనం, పరమాణు డాకింగ్‌పై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివకుమార్ మార్గదర్శనం వహించారు. క్యాన్సర్ మార్బిడ్రగ్, రెసిస్టెంట్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌పై ఈ పరిశోధన ఫలితాలు ఉండనున్నాయి. ఈ మేరకు పీహెచ్‌డీ పట్టా అందించారు. ఈ సందర్భంగా గీతం యూనివర్సిటీ హైదరాబాద్ అదనపు కులపతి ప్రొఫెసర్ డీఎస్ గీతం రావు, రెసిస్టెంట్ డైరెక్టర్ డీవీవీ ఎస్‌ఆర్ వర్మ, డీన్ ప్రొఫెసర్ జగత్తరస్ దాస్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది అఫ్రోజ్‌ను అభినందించారు.